# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియ మొదలైందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు.
- ❖ చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకునే అంశంపై ప్రజలలో అవగాహన కల్పించాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధికారులను కోరారు.
- ❖ రాష్ట్రంలో మరిన్ని దేవాలయాలకు ధూప, దీప నైవేద్యం కింద నిధులు అందిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు.
- ❖ మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని రాష్ట్రంలో ఈ రోజు ఘనంగా నిర్వహించారు.
- ❖ నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్రవాయుగుండం రేపటికి తుపానుగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం ప్రకటించింది.

========================

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూల్ లో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... హైకోర్టు బెంచ్ కోసం స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని టీజీ భరత్ మాట్లాడుతూ...

(వాయిస్ 29 సెకన్లు)

========================

చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకునే అంశంపై ప్రజలలో విస్తృతమైన అవగాహన కల్పించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధికారులను కోరారు. విశాఖపట్నంలో ఈ రోజు జాతీయ దత్తత

అవగాహనా మాసోత్సవాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, చిన్నారులు ఎవ్వరూ కూడా కుటుంబ బంధాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో, కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ సంచాలకులు డాక్టర్ జగన్నాథ్ పాటి, మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు ఎం.వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

========================

రాష్ట్రంలోని మరిన్ని ఆలయాలకు ధూప, దీప నైవేద్యం కింద నిధులు అందిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. ఇప్పటికే ఆలయాలకు ఇస్తున్న నిధులను రెన్యూవల్ చేశామని తెలిపారు. తిరుమలలో ఈ రోజు మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి  పాత్రికేయులతో మాట్లాడుతూ, ధూప, దీప నైవేద్యాలకు ఇస్తున్న నిధుల మొత్తాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 10 వేల రూపాయలకు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5,400 ఆలయాలకు ధూప, దీప నైవేద్యానికి నిధులు ఇస్తున్నామని ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

========================

కులవివక్ష సహా సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. జ్యోతీరావ్ పూలే 134వ వర్ధంతి సందర్భంగా ఒంగోలులో ఈ రోజు జరిగిన  కార్యక్రమంలో  ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతపురం జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అంజలి ఘటించారు.

========================

మహాత్మా జ్యోతీరావు పూలే స్పూర్తితో రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నామని రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

========================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) డిసెంబర్ 4వ తేదీన తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్‌వీ సి.59 రాకెట్ ప్రయోగించనుందని అధికారులు తెలిపారు.  ఆ రోజు సాయంత్రం 4 గంటల 8 నిముషాలకు ఈ రాకెట్‌ను ప్రయోగిస్తారు. ప్రస్తుతం శ్రీహరికోట షార్ లోని ప్రయోగ వేదికకు సంబంధించిన మొబైల్ సర్వీస్ టవర్ లో పీఎస్ఎల్వీ సీ59 రాకెట్ అనుసంధానం పనులు చురుగ్గా జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. సీ-59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోభా-3 అనే ఉపగ్రహంతో పాటు మరో నాలుగు చిన్నతరహా ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించనున్నారు. ఇదిలా ఉండగా, డిసెంబర్ 24న పీఎస్ఎల్వీ సీ60 పేరుతో మరో రాకెట్‌ను ఇస్రో ప్రయోగించనుంది. ఈ రాకెట్ ద్వారా రిశాట్-1బీ అనే ఉపగ్రహంతో పాటు మరో నాలుగు వాణిజ్యపరమైన ఉపగ్రహాలను ప్రయోగించబోతున్నారని ఇస్రో వర్గాలు తెలిపాయి.

========================

రైతు సాధికారత సంస్థ ద్వారా రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను అంతర్జాతీయ ప్రతినిధి బృందం సందర్శించనుంది. ఈ బృందం చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో రేపు పర్యటించనుందని సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఆగ్రోఏకాలజీలో జరుగుతున్న నూతన పరిజ్ఞానాన్ని పరిశీలించే క్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఈ బృందంలో 20

దేశాలకు చెందిన 27 మంది ప్రతినిధులతో పాటు 9 మంది భారతీయ ప్రతినిధులు కూడా ఉంటారు. అదే విధంగా, ఆగ్రో ఎకాలజీ అభ్యాసకులు, పరిశోధకులు, రైతు ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు ఈ పర్యటనలో పాల్గొంటారు.

========================

నైరుతి బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండం రేపు ఉదాయనికి తుపానుగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో బలమైన గాలులు గంటకు 65 కిలోమీటర్ల గరిష్టంగా 85 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ అధికారి తెలియచేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

విరామం

========================

తుఫాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని పశ్చిమ గోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల, లంకలకోడేరు, బల్లిపాడు, పాలమూరు గ్రామాలలో ఆయన ఈ రోజు పర్యటించారు. రైతులు పొలాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని, తూకం వేస్తున్న ధాన్యం బస్తాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో కూడా వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అన్ని విధాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని తడవకుండా భద్రపరచుకోవాలన్నారు.

========================

హిసార్- తిరుపతి - హిసార్ మార్గంలో వారాంతపు ప్రత్యేక రైళ్లను డిసెంబర్ నెలలో దక్షిణ మధ్య రైల్వే నడుపుతోందని అధికారులు తెలిపారు. 04717 నంబరు గల హిసార్ - తిరుపతి ప్రత్యేక రైలు డిసెంబర్ 7 14వ తేదీలలో నడుస్తుందని అన్నారు. అదేవిధంగా 04718 నంబరు గల తిరుపతి - హిసార్ డిసెంబర్ 9, 16వ తేదీల్లో నడుస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ప్రయాణీకులు విజ్ఞప్తి మేరకు ఈ ప్రత్యేక రైళ్లు ఒంగోలు స్టేషన్‌లో కూడా ఆగుతుందని రైల్వే అధికారులు వెల్లడించారు.

========================

జాతీయ యువజనోత్సవాలలో భాగంగా 2025 జనవరి 11, 12 తేదీల్లో వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమాన్ని కేంద్ర క్రీడాశాఖ మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ ప్రకటించారని విశాఖ జిల్లా నెహ్రూయువకేంద్ర అధికారి జి. మహేశ్వర రావు తెలిపారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మూడు వేల మంది యువనాయకులతో ముఖాముఖి వుంటుందని తెలిపారు. వికసిత భారత్ ఛాలెంజ్ అనేది నాలుగంచెల పోటీ అని యువత ఇందులో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవచ్చన్నారు.

========================

బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందని శ్రీకాకుళం జిల్లా న్యాయసేవాదికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో ఈ రోజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.... బాల్య వివాహాల నిర్మూలనకు జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్ ఇతర శాఖల చేస్తున్న కృషి ఎంతో అభినందనీయం అన్నారు. బాల్య వివాహాల రహిత సమాజాన్ని ఆవిష్కరించే దిశగా అడుగులు వేయాలని కోరారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు ప్రతీ ఒక్కరికి తెలియజేయాలన్నారు.

=========================

క్రీడా స్ఫూర్తితో సమాజానికి మెరుగైన సేవలందించాలని పోలీసు సిబ్బందికి విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ సూచించారు. 31వ వార్షిక జిల్లా పోలీసు ఉద్యోగుల క్రీడా పోటీలు విజయనగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఈ రోజు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు సాగే ఈ పోటీలను ఎస్పీ వకుల్‌జిందల్‌తో కలసి ఆయన ప్రారంభించారు. మూడు సబ్ డివిజన్లు, ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్లకు చెందిన పోలీసు ఉద్యోగులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలీసు ఉద్యోగులు అన్ని రంగాల్లోనూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని పిలుపునిచ్చారు. శారీరక సామర్థ్యంతోపాటు, మానసిక ఆనందం కూడా చాలా అవసరమని.. వాటిని మెరుగుపర్చుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు.

=========================

కొత్త ఓటర్లను చేర్పించడానికి అన్ని ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, వృద్ధుల సంక్షేమ శాఖల ప్రభుత్వ కార్యదర్శి, ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఎ.సూర్యకుమారి కోరారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై ఆర్ ఓ లు, ఏఈఆర్వోలతో బాపట్ల జిల్లా  కలెక్టరేట్ లో ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే బాధ్యత అధికారులపై ఉందన్నారు.

=========================

తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అమ్మవారికి ఈ రోజు పట్టువస్త్రాలను సమర్పించారు. ఊరేగింపుగా సారెను తీసుకెళ్ళి ఆలయ వేదపండితులకు ఆయన అందజేశారు. అనంతరం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

=========================
=========================